

అవులను గోశాలకు తరలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ, జీహెచ్‌ఎంసీ సిబ్బంది

గోశాలకు పశువుల తరలింపు

బేగంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తర మండల ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆదివారం ప్రధాన రోడ్లలో ట్రాఫిక్‌కు అడ్డంగా వస్తున్న పశువులను తరలించే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహనదారుల నుంచి తరచూ వచ్చే ఫిర్యాదుల ఆధారంగా ఈ చర్య చేపట్టినట్లు ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. వీధుల్లో తిరుగుతున్న ఆవులు, ఎద్దులు, గేదెలు ట్రాఫిక్‌కు ఆటంకంగా మారి, వాహనాల రాక పోకలకు అంతరాయం కలిగిస్తూ, పాదచారుల్లో భయం కలిగించడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో రెండు వీధి ఆవులను రక్షించి కూకట్‌పల్లి వద్ద ఉన్న గోశాలకు తరలించామన్నారు.

చాక్లెట్ దొంగ దొరికాడు

యూసుఫ్‌గూడ, మే 11 (ఆంధ్రజ్యోతి): సూపర్ మార్కెట్‌కి వెళ్లిన ఓ వ్యక్తి చాక్లెట్లను దొంగిలించిన ఘటన మధురా నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 28న ఓ వ్యక్తి మధురానగర్‌లోని కె.పి.ఎస్ సూపర్ మార్కెట్‌కు వెళ్లాడు. సుమారు రూ.10,000 విలువ చేసే చాక్లెట్లను కవర్‌లో నింపుకొని బిల్లు కట్టకుండా వెళ్లిపోయాడు. సీసీ కెమెరాలను పరిశీలించిన యాజమాన్యం దొంగతనం జరిగిందని గుర్తించారు. అదే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం 1.30కి మళ్లీ మార్కెట్‌కి వచ్చి సుమారు రూ.3,000 విలువ గల చాక్లెట్లను తీసుకున్నాడు. సూపర్ మార్కెట్ లో పనిచేస్తున్న సిబ్బంది గుర్తుపట్టి మేనేజర్‌కు ఆ వ్యక్తిని అప్పజెప్పారు. స్టోర్ మేనేజర్ ఉదయ్ కిరణ్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ దొంగిలించాడు..

యూసుఫ్‌గూడ, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రార్థనా మందిరంలో ఉన్న ఓ వ్యక్తి నుంచి సెల్ ఫోన్ దొంగిలించిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధి లో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కడపకు చెందిన సోహెల్ అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌లో కోచింగ్ తీసుకుంటూ ప్రార్థన మందిరంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి అతడి సెల్‌ఫోన్ తస్కరించి పారి పోయాడు. సోహెల్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐదుగురు గంజాయి వినియోగదారులపై కేసు

యూసుఫ్‌గూడ, మే 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ గుంటూరుకు చెందిన ధనుంజయ, వినోద్ కుమార్, ఈశ్వర్, సైఫ్, ప్రవీణ్ లు రహమత్ నగర్‌లోని ఓంనగర్‌లో ఉంటున్నారు. బీదర్ నుంచి గంజాయిని తెప్పించుకొని సేవిస్తున్నారు. మధురానగర్ పోలీసులకు సమాచారం తెలియడంతో గంజాయి రాయుళ్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.



కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు ఫిర్యాదు చేస్తున్న జవహర్‌కాలనీ వాసులు

విద్యుత్ సరఫరా నిలిపివేతపై కార్పొరేటర్‌కు ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కాలనీలోని యూపీహెచ్‌సి సెంటర్‌కు మంచినీరు, విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వైద్య సేవలు నిలిచిపోయాయని స్థానికులు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. యూపీహెచ్‌సి ఉన్న భవనానికి యేడాదిన్నర కాలంగా అద్దె చెల్లించకపోవడంతో యజమానికి మౌలిక వసతులను ఆపేస్తున్నాడని దీం తో గర్భిణులు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర వైద్యం కోసం శ్రీరాంనగర్ ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు తెలిపారు. స్పందించిన కార్పొరేటర్ ఈ సమస్యపై ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. వైద్య శాఖ అధికారులతో త్వరలో కలిసి పరిస్థితి వివరించనున్నట్టు భరోసా కల్పించారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పంజాగుట్ట, మే11 (ఆంధ్రజ్యోతి): సుమారు 60 ఏళ్ల క్రితం తాము చదువుకున్న పాఠశాలలో తమ చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. చిన్న పిల్ల మారి ఒరేయ్ నువ్వా ఎలా ఉండేవాడివి ఎలా అయిపోయావు. ఎంతమంది పిల్లలు.ఎంతమంది మనవళ్లు, మనవరాళ్లు అంటూ ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. నల్గొండ మల్టీ పర్పస్ హైస్కూల్ 1970 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సోమాజిగూడలోని ఓ హోటల్ లో జరిగింది. ఇంటర్ పూర్తిచేసిన 55 ఏళ్ల తర్వాత వారంతా ఒకచోట చేరారు. అప్పటి గురువులు బోధనలను గుర్తుచేసుకున్నారు. పంజాగుట్ట ద్వారకాపురి కాలనీకి చెందిన వ్యాపారవేత్త మంచుకొండ ప్రకాశం తనతో చదువుకున్న విద్యార్థులందరినీ ఒకచోటకు చేర్చాలని ఆలోచన చేశారు. సుమారు నాలుగు నెలల పాటు శ్రమించి సుమారు వంద మంది వివరాలను సేకరించ గలిగారు. మిత్రులు వినోద్, వెంకన్న మరి కొంతమంది సహాయంతో గెట్ టు గెదర్ పార్టీ రూపుదిద్దుతుంది.



ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకురాలు

ముగిసిన జువెలరీ ఫెయిర్

హైటెక్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): ఇన్ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో మూడు రోజులపాటు హైటెక్స్‌లో నిర్వహించిన 17వ హైదరాబాద్ జువెలరీ, పెర్ల్ అండ్ జెమ్ ఫెయిర్ ఆదివారం ముగిసింది. బీ2బీ ఆభరణాల వాణిజ్య వేదికగా ఈ కార్యక్రమం నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. దేశ విదేశాల నుంచి వేలాది మంది వ్యాపారులు, డిజైనర్లు, తయారీదారులు, రిటైలర్లు హాజరయ్యారు. ఇన్ఫార్మా మార్కెట్స్ ఇండియా ఎండీ యోగేష్ ముద్రాస్ మాట్లాడుతూ, మనదేశంలో ఆభరణాల వ్యాపారం 2030 నాటికి 168 బిలియన్ల డాలర్లకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఆటస్థలాల రక్షణకు

ప్రత్యేక ఏర్పాట్లు

- పూర్తి వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరిచిన అధికారులు
- ఖైరతాబాద్ జోన్‌లో 144 స్థలాల్లో వాడుతున్నవి 22 మాత్రమే



ఆటస్థలాల వివరాలను సేకరిస్తున్న అధికారులు

ఖైరతాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎన్నో ఆటస్థలాలున్నా, వాటిని పరిరక్షించుకోలేక కొన్ని అన్యాక్రాంతమయ్యాయి. కొన్ని చోట్ల జీహెచ్‌ఎంసీకి చెందిన స్థలాలున్నా ఆయా విభాగాల అధికారులకు అసలు అవి తమవనే తెలియదు. ఉదాహరణకు ఖైరతాబాద్ జోన్ పరిధిలో జీహెచ్‌ఎంసీ ఆటస్థలాలు రికార్డుల ప్రకారం 144 ఉండగా అందులో వాడుతున్నవి 22 మాత్రమే. మిగతా 122 ఆట స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయి. అందులో కొన్నింటిని చుట్టుపక్కలవారు, అంగబలం, కండబలం ఉన్నవారు కబ్జా చేసుకొని దర్జాగా నివసిస్తున్నారు. ఇటీవలే వేసవి శిక్షణ శిబిరాల కోసం ఖైరతాబాద్ జోన్‌లో జీహెచ్‌ఎంసీకి ఎన్ని ఆట స్థలాలున్నాయి.. అందులో ఎన్నింటిలో వేసవి శిక్షణ శిబిరాలు నడుస్తున్నాయన్న విషయమై ఉన్నతాధికారులు ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. 144 ఆట స్థలాల్లో 22 చోట్ల మాత్రమే శిబిరాలు పెట్టడంపై ఆగ్రహించిన ఉన్నతాధికారి మిగతా ఆటస్థలాల విషయమై విచారించి నివేదిక సమర్పించాలని కోరగా అధికారులు విచారించారు. ఇందులో కొన్ని స్థలాలు అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది. మొదట వీటిపై నివేదికలు తీసుకొని అనంతరం కబ్జాదారులపై చర్యలు తీసుకునే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

మున్సిపల్ స్థలాల వివరాలకై ప్రత్యేక యాప్

జీహెచ్‌ఎంసీకి చెందిన ఆటస్థలాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, స్విమ్మింగ్ పూళ్ల వివరాలను పొందుపరిచేందుకు ప్రత్యేక యాప్ తయారుచేశారు. జీహెచ్‌ఎంసీ అండర్‌స్కోర్ ఏఎంఎస్ పేరిట ఉన్న ఈ యాప్ కోసం ఆయా జోన్ల క్రీడా విభాగం అధికారులకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు ఇచ్చి అందులో జోన్ పరిధిలోని క్రీడా ప్రాంగణాల పూర్తి వివరాలు పొందుపరిచేలా ఆదేశాలు ఇచ్చారు. ఖైరతాబాద్ జోన్‌లో 144 ఆటస్థలాలు, 9 క్రీడా కాంప్లెక్స్‌లు, 4 స్విమ్మింగ్ పూళ్లు ఉన్నాయి. ఆయా స్థలాల వివరాలను ఫొటోలు, వీడియోలు, లొకేషన్‌లతో పొందుపరచడమే కాకుండా అక్కడున్న వసతులపై యాప్‌ను డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. ఎవరైనా స్థలాలను ఆక్రమిస్తే వాటి వివరాలను చేర్చడంతో పాటు అక్కడ అవసరం మేరకు సీసీ కెమెరాలను, సూచిక బోర్డులను, విద్యుత్ దీపాలను, ఆర్చ్‌లను ఏర్పాటు చేసి మొక్కలను పెంచాలని నిర్ణయించారు. 144 ఆటస్థలాల్లో సర్కిల్ 12 మెహదీపట్నంలో 30, సర్కిల్ 13 కార్వాన్‌లో 16, సర్కిల్ 14 గోషామహల్‌లో 24, సర్కిల్ 17 ఖైరతాబాద్‌లో 43, సర్కిల్ 18 జూబ్లీహిల్స్‌లో 31 రికార్డుల ప్రకారం ఉన్నాయి. వీటన్నింటిపై ప్రత్యేక నిఘా పెట్టి వాటి వివరాలను సేకరించి ఉన్నతాకారులకు నివేదికలు పంపి, యాప్‌లో వివరాలను పొందుపరిచారు.

ప్రతి ప్లే గ్రౌండ్‌కూ కేర్ టేకర్ అవసరం

జీహెచ్‌ఎంసీ తమ ఆటస్థలాలను పరిరక్షించుకునేందుకు చాలా చోట్ల ఏర్పాట్లు చేయకపోవడంతో కొన్ని అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది. కాగా ఆటస్థలాల్లో, క్రీడా కాంప్లెక్స్‌లలో కోచింగ్‌లు ఇచ్చేందుకు గౌరవ కోచ్‌లను, పార్ట్‌టైం కోచ్‌లను నియమించింది. ఖైరతాబాద్ జోన్‌లో ప్రస్తుతం 174 మంది గౌరవ కోచ్‌లు ఉండగా 22 మంది పార్ట్‌టైం కోచ్‌లు బాధ్యతలు చేపడుతున్నారు. వేసవి శిక్షణతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఏడాది పొడవునా ఆటస్థలాల పరిరక్షణకు కేర్ టేకర్లను నియమిస్తే అవి కబ్జాకు గురికాకుండా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. మరికొన్ని చోట్ల జీహెచ్‌ఎంసీ ఆటస్థలాలపై పర్యవేక్షణ గాలికి వదిలేయగా కొందరు తమ సొంత ఆస్తులుగా వాటిని శుభ కార్యాలు, వాణిజ్య అవసరాలకు అద్దెకిచ్చుకుంటున్నారు. ఇలాంటి ఆదాయం మధ్యవర్తుల జేబుల్లోకి వెళ్తున్న నేపథ్యంలో వాటిని పర్యవేక్షించి ఆదాయం వచ్చేలా చేయాల్సిన అవసరం జీహెచ్‌ఎంసీకి ఉన్నది.

త్యాగానికి చిరునామా అమ్మ: ఎమ్మెల్యే తలసాని

బేగంపేట, అమీర్‌పేట, మే 11 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి చిరునామా అమ్మ అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం సనత్‌నగర్ డివిజన్‌లోని బీకే గూడ పార్క్ వద్ద శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మ లేనిదే సృష్టిలేదని, అమ్మ ప్రేమ వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు, స్వీట్లు, పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని, కార్పొరేటర్ లక్ష్మి

మోడల్ కాలనీలో..

మాతృ దినోత్సవం సందర్భంగా మోడల్ కాలనీ పార్క్‌లో నిర్వహించిన సామూహిక సీమంతాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని, కార్పొరేటర్ కొలను లక్ష్మి పాల్గొన్నారు. మహిళలకు చీరలు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీమాతా సేవా సమితి అధ్యక్షులు విజయకుసుమ, పద్మ, రాధిక, కళావతి, శోభా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బీకేగూడలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో సుమారు 80 మందికి మధుమేహం, ఎస్‌పీఓ- 2, హిమోగ్లోబిన్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి జనరల్ ఫిజీషియన్ కన్సల్టేషన్ అందించారు. ఇకపోతే శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్, ఆస్టర్ డీఎం ఫౌండేషన్ సంయుక్తంగా 300 మంది మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు.



ఎస్పీఆర్ హిల్స్ రెండు బొమ్మల కూడలిలో సార్వత్రిక సమ్మె పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి: రాపర్తి

బోరబండ, మే 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక కోడ్ లకు వ్యతిరేకంగా మే 20వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు రాపర్తి అశోక్ కోరారు. రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ రెండు బొమ్మల కూడలిలో భవన నిర్మాణ కార్మిక సంఘం గోడపత్రికను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమ లు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 8గంటల పని దినాలు కాపాడుకోవడం కోసం సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని కార్మికులకు సూచించారు. భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికుల క్షేమం కోరుతూ..



అమరులకు నివాళులర్పిస్తున్న మధురానగర్ కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధులు

వెంగళరావునగర్, మే11 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైనిక దళాల సాహసానికి జేజేలు పలుకుతూ వారికి సంఘీభావంగా మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. మధురానగర్ డి-బ్లాక్ పార్క్ నుంచి మోర్ సూపర్ మార్కెట్ వరకు ర్యాలీ కొనసాగింది. కష్ట కాలంలో దేశాన్ని కాపాడుతున్న సైనికులకు, సైన్యానికి సెల్యూట్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం మధురానగర్ చౌరస్తాలో కశ్మీర్ సరిహద్దుల్లో పాకిస్థాన్ దాడిలో అమరులైన సైనికులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ర్యాలీలో సంక్షేమ సమితి ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు

కట్టమైసమ్మ ఆలయంలో..

బేగంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదేశంలో పోరాటం చేసిన భారత సైనికుల ఆరోగ్యం కోసం బేగంపేటలోని శ్రీ కట్టమైసమ్మ మహాలక్ష్మి ఆలయంలో బీజేపీ యువనేత మర్రి పురురవారెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరిహద్దుల్లో పోరాడిన సైనికులకు విజయం దక్కినందుకు, వారు ఆరోగ్యంగా ఉండాలంటూ అమ్మవారికి పూజలు నిర్వహించారు. పూజల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బేగంపేటలోని కట్టమైసమ్మ ఆలయంలో పూజల్లో బీజేపీ యువనేత పురురవారెడ్డి

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

అమీర్‌పేట, మే 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశం ఉగ్రవాదుల కుట్రలకు నష్టపోకుండా, పాడి పంటలతో సుభిక్షంగా ఉండేలా తమ చల్లని చూపు దేశ ప్రజలకు అందించాలని వేడుకుంటూ బీజేపీ నాయకులు ఆదివారం బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. డివిజన్ అధ్యక్షుడు అనంతుల పవన్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ మాజీ అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్ గౌడ్, పార్టీ శ్రేణులతో కలిసి ఆలయానికి వచ్చి గర్భగుడిలో ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్ గౌడ్‌కు శేషవస్త్రం బహుకరించి వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ, మోదీ ప్రధాని అయ్యాక ఎన్నో సంస్కరణలు తీసుకురావడం జరిగిందన్నారు. ఇది ఓర్వలేని దాయాది దేశం ఉగ్ర మూకలను దేశంలోకి పంపిస్తూ అల్లకల్లోలం సృష్టించాలని చూస్తున్నారని ఇందుకు పహల్గాం ఘటనే ఉదాహరణమన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి గౌడ్, ఆర్. లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

తల్లిని చూడడానికి వచ్చి కొడుకు అదృశ్యం

కల్లు దొరక్క వింత ప్రవర్తన అనే అనుమానం



అహ్మద్ పాషా

పంజాగుట్ట, మే11 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో చికిత్స పొందుతున్న తల్లిని చూడడానికి వచ్చి కుమారుడు అదృశ్యమైన సంఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎండీ అహ్మద్ పాషా (49)తల్లి డయాలసిస్ నిమిత్తం కొద్ది రోజుల క్రితం నిమ్స్ ఆసుపత్రిలో చేరింది. ఆమెను చూడడానికి అహ్మద్ ఈ నెల 9న నిమ్స్‌కి వచ్చాడు. తల్లిని చూసిన అనంతరం భోజనం చేసి వస్తానని చెప్పి బయటికి వెళ్లాడు. ఎంత సేపటికి అతను తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేశారు. ఫోన్‌లో మాట్లాడినా తాను ఎక్కడ ఉన్నాడో స్పష్టంగా చెప్పలేకపోయాడు. తర్వాత మరో వ్యక్తి ఫోన్ తీసుకొని శ్రీనగర్ కాలనీలోని సాయిబాబా గుడిలో ఉన్నాడని చెప్పాడు. అక్కడ వెతికినా కనిపించలేదు. ఆ తరువాత అతని ఫోన్ స్విచాఫ్ అయింది. అహ్మద్ మానసిక స్థితి స్థిరంగా లేకపోవడం, అతనికి కల్లు తాగే అలవాటు ఉందని, కల్లు దొరకకపోవడంతో వెళ్లిపోయి ఉంటాడని అతని బావమరిది డి.యాసిన్ ఆదివారం పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నరసింహ దేవాలయంలో అర్చకులతో కార్పొరేటర్ విజయారెడ్డి

వైభవంగా బండ నరసింహ స్వామి జయంతి

ఖైరతాబాద్, మే11 (ఆంధ్రజ్యోతి): నరసింహ స్వామి జయంతి సందర్భంగా ఖైరతాబాద్ బండ నరసింహస్వామి దేవాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. 300 సంవత్సరాల క్రితం స్వయంభువుగా వెలసిన బండ నరసింహస్వామి దేవాలయంలో ఉదయం నుండి నిజరూప స్వామి వారికి అభిషేకం, నారసింహ స్వామి హోమం, అర్చన, పూజాకార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో ఖైరతాబాద్ కార్పొరేటర్‌తో పాటు పలువురు రాజకీయ నాయకులు, చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశ్వాపురం వేణుమాధవ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడువయూరి రవీందర్‌తో పాటు పెద్ద ఎత్తున భక్తులు హాజరై పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు తింత్రిణీపురం శ్రీహరి స్వామి, తదితరులు పాలొన్నారు.



శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులు

కనులపండువగా స్వామి జయంతి వేడుకలు

బంజారాహిల్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12లోని స్వయంభు లక్ష్మీనర్సింహ స్వామి (స్వర్ణ) దేవాలయంలో హరే కృష్ణమూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నరసింహ జయంతి వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం అనంతరం నరసింహ మహాహోమం, పూర్ణాహుతి భూ సమేత లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహానికి 108 కలశాలతో మహా అభిషేకం అనంతరం ఉంజాల సేవ చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనర్సింహ స్వామి కళ్యాణం చూడముచ్చటగా జరిగింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పూజాదికాల్లో పాల్గొన్నారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్రగౌరదాస ప్రవచనంతో ఉత్సవాలు ముగిశాయి.



బోరబండ హరిహర క్షేత్ర ఆలయంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

బోరబండ, మే 11 (ఆంధ్రజ్యోతి): బోరబండ స్వరాజ్యనగర్ హరిహర క్షేత్ర దేవస్థానంలో శ్రీ స్వయంభూ శీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో రెండవ రోజైన ఆదివారం శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి సుప్రభాత సేవ, మంగళ శాసనం, యాగమంటపారాధన, నిత్యహోమం కార్యక్రమాలు నిర్వహించారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్యం



మాదాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. మొట్టమొదటగా సాత్విక రెడ్డి కూచిపూడి నృత్య ప్రదర్శనలో సరస్వతి స్తుతి, ఓంకారకారిని, పాదసేవనం అంశాలను ప్రదర్శించి మెప్పించారు. తరువాత శ్రావ్య బండారు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో భజమానస విఘ్నేశ్వర, మహాగణపతిమ్, తీరు తీరు జవరాల, పరమపురుషుడు, చిన్ని శిశువు, ముద్దుగారే యశోద, నవరసములది నళినాక్షి, ఒకపరికొకపరి, మధురానగరిలో ప్రదర్శించి మెప్పించారు.



డ్రమ్స్ మోగిస్తున్న చిన్నారులు. వారి తల్లులు

వాయిద్యాలతో అమ్మల సందడి

బంజారాహిల్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులకు జన్మనిచ్చిన తల్లులు తమ పిల్లలతో వాయిద్యాలు వాయిస్తూ సందడి చేశారు. వీనుల విందుగా సాగిన సంగీతాన్ని ఆస్వాదించారు. మాతృదినోత్సవ వేడుకల్లో భాగంగా బంజారాహిల్స్ లుంబినీ మాల్‌లో ఆదివారం శాంక్టమ్ నేచురల్ బర్త్ సెంటర్ హోలిస్టిక్ మెటర్నిటీ వెల్‌నెస్ సెంటర్, డ్రమ్మింగ్ సర్కిల్ ది జెంబే సంయుక్తాధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

టీడీపీని బలోపేతం చేస్తాం: విఠల్

వెంగళరావునగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సంస్థాగత నిర్మాణంలో ఎన్నికలలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళరావునగర్ డివిజన్ కమిటీ ఏర్పాటు కోసం ఆదివారం మధురానగర్ లో పార్టీ నాయకుల సమావేశం జరిగింది. నియోజకవర్గం పరిశీలకులు ఎం.కె బోస్.సి.విఠల్ ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ విస్తృతస్థాయి సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. డివిజన్ కమిటీ ప్రతిపాదనలను పరిశీలకులకు అందజేశారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ, పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తామన్నారు.


ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసిన రసూల్‌పురా వాసులు

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని వినతి

అడ్డగుట్ట, మే 11 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురా వార్డు-2 నారాయణ జోపిడి డబుల్ బెడ్‌రూం కాలనీ అధ్యక్షుడు గఫార్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఇళ్ల నిర్మాణం పూర్తయితే 296 కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే డబుల్ బెడ్‌రూంల అంశంపై ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'కార్మికుల సంక్షేమానికి సంఘాలు అండగా నిలవాలి'

అడ్డగుట్ట, మే 11 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంఘాలు అండగా నిలవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సూచించారు. ఆదివారం అడ్డగుట్టలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు మల్లేష్, చైర్మన్ రాము, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడు మనోహర్, కోశాధికారి కొండల్‌రావు, నాగరాజులు పాల్గొన్నారు.

ఐక్యతకు దిక్సూచి భారత రాజ్యాంగం


అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేస్తున్న దళిత బహుజన ఫ్రంట్ నాయకులు

బౌద్ధనగర్, మే 11(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ఐక్యతకు దిక్సూచిగా నిలుస్తుందని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. ఆదివారం సీతాఫల్‌మండిలో అంబేడ్కర్ విగ్రహానికి 20వ జ్ఞానమాలను వేశారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ పటిష్టమైన భారత రాజ్యాంగం దేశ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తుందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక, ఆర్థిక న్యాయమే రాజ్యాంగ ఊపిరి అన్నారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వృద్ధురాలికి సన్మానం చేస్తున్న రుద్రవీణ మహిళా సంఘం ప్రతినిధులు

మహిళలు ఐక్యత కోసం పనిచేయాలి

అడ్డగుట్ట, మే 11 (ఆంధ్రజ్యోతి) : అమ్మ లేకపోతే జననం లేదు, అమ్మ లేకపోతే గమనం లేదని రుద్రవీణ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభ అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం అడ్డగుట్ట శాస్త్రి నగర్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో అముదలక్ష్మి అనే వృద్ధురాలికి సన్మానం చేసి కొంత ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా మహిళలు ఐక్యత కోసం, మహిళల హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు రామలీల, రమాదేవి, బుద్ధ భాగ్యలతో పాటు సంఘం ముఖ్య సభ్యురాళ్లు పద్మ, జ్యోతి, కవిత, యాదమ్మ, రేవతి, రేచల్, హసీనా, జాన్, సునిత, సురేఖ; హేమలత, మల్లమ్మ, యాదమ్మలు పాల్గొన్నారు.



నివాళులు

జై భీమ్ మాల మహానాడు సంఘం వ్యవస్థాపకులు పీవీ రావు జయంతి సందర్భంగా శనివారం రాత్రి తుకారాంగేట్‌లోని ఆయన చిత్ర పటానికి ఆ సంఘం నాయకురాలు రామలీల, రమాదేవి, సాయి ప్రసాద్, శివలింగంలు ఘనంగా నివాళులర్పించారు.

- (అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి)



ఉత్సవంలో నాయకులు

కంటోన్మెంట్‌లోని కార్ఖానా దర్గాలో ఆదివారం జరిగిన ఉర్సు ఉత్సవాల్లో రాష్ట్ర మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

- (సికింద్రాబాద్- ఆంధ్రజ్యోతి)

చిరు జల్లులకే చిత్తడిగా రహదారులు

- అధ్వానంగా పరిసరాలు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు
- దుర్వాసనతో ప్రజల ఇక్కట్లు

సికింద్రాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి): వర్షం కురిసిందంటే చాలు.. ప్రధాన రహదారుల్లో రోజుల తరబడి వర్షపునీరు నిలిచిపోయి, పరిసరాలను అధ్వానంగా మారుస్తున్నాయి. వర్షపు నీటిని తొలగించడం, రాకపోకలు సాఫీగా సాగేలా చూడడం, ఇటు దుర్గంధ భరిత వాతావరణం ఉత్పన్నం కాకుండా చూడాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా లష్కర్‌లోని ప్రధాన రహదారులు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ జంక్షన్-ప్యారడైజ్ జంక్షన్ మధ్యున్న ప్రధాన రహదారుల్లో పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోయింది. సికింద్రాబాద్‌లోని స్విమ్మింగ్ పూల్ సమీపంలో, పరేడ్‌గ్రౌండ్ ఎదురుగా పెట్రోల్ పంప్ వద్ద, సీటీసీ జంక్షన్, జింఖానా మైదానం ఎదురుగా, ఫైర్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో కొద్ది రోజులుగా వర్షపునీరు నిలిచిపోయి ఉండడంతో ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. మరోవైపు వర్షపునీటిలో దోమలు వాలడం, బురదమయంగా మారడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. నిత్యం వేలాది వాహనాలు, లక్షలాది మంది ప్రజలు సంచరించే ప్రధాన రహదారుల్లో నెలకొన్న ఈ సమస్యలను పరిష్కరించడంలో జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ పాదచారులు, వాహనదారులు మండిపడుతున్నారు. సికింద్రాబాద్ నడిబొడ్డున ఉన్న ప్రధాన రహదారుల్లోనే ఈ పరిస్థితి ఉంటే.. మిగతా ప్రాంతాల్లో దుస్థితి ఎలా ఉంటుందోనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, ఇంజనీరింగ్, పారిశుధ్య నిర్వహణ విభాగాల అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


సీటీసీ జంక్షన్ బస్టాప్ వద్ద


పరేడ్‌గ్రౌండ్ ఎదురుగా పెట్రోల్ బంక్ వద్ద


స్విమ్మింగ్ పూల్ సమీపంలో


జింఖానా మైదానం పక్కన

రూ.2కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం : ఈటల రాజేందర్

తిరుమలగిరి మే 11 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంటు సమగ్రాభివృద్ధికి రూ.2కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. అందులో భాగంగానే రూ.40 లక్షలతో బొల్లారం రిసాలబజార్‌లో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటోన్మెంటులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అంతర్గత రోడ్లను, ప్రధాన రోడ్డు మార్గాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామన్నారు. బొల్లారం జనప్రియ కాలనీలో ఎన్నో ఏళ్ల తరబడి స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ అధికారులను ఫోన్లో సంప్రతించారు. డ్రైనేజీ లైన్ పక్కనే ఎలక్ట్రిసిటీ లైన్ ఉండడంతో సమస్య జటిలంగా మారిందని శాఖల మధ్య సమన్వయం చేసి సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, బీజేపి సీనియర్ నాయకులు శ్రీకాంత్ జైనపల్లి, జేవీ నర్సింగరావు, ధనంజయ చారి, కిరణ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నర్సింహన్, జీవి బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్


తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న జె.రామకృష్ణ

సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ

సికింద్రాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం చోటు చేసుకున్న పరిణామాల్లో కేంద్రం ఉగ్రవాద నిర్మూలనే లక్ష్యంగా భారత సైన్యం అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శిస్తున్నదని సికింద్రాబాద్ కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జె.రామకృష్ణ అన్నారు. భారత సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఆదివారం కంటోన్మెంట్ 5వ వార్డు గాంధీనగర్‌లో ఆయన తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం త్రివిధ దళాలకు మానసికంగా అండగా నిలబడేందుకు, వారికి తగిన శక్తిని ప్రసాదించేందుకు నల్లపోచమ్మ ఆలయంలో పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు బీజేపీ అధ్యక్షుడు సంతోష్, విజయ్‌యాదవ్, భిక్షపతి, శంకర్, శివకుమార్, వీరేష్, బాబు, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

సైబర్ నేరాలపై అవగాహన

బోయినపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : ది ఆదర్శ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ బోయినపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆర్.ఆర్.నగర్‌లో స్థానికులకు పరిశుభ్రత, చిన్న పిల్లల్లో పొదుపు ఆవశ్యకత, సైబర్ నేరాలపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు బ్యాంకు సిబ్బంది సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఏవిధంగా కాపాడుకోవచ్చో తెలియజేసేవిధంగా బ్యాంకు రూపొందించి, ముద్రించిన పుస్తకాలను స్థానిక ప్రజలకు అందజేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ ఆదర్శ్ బ్యాంక్ ఆదివారం కూడా వినియోగదారులకు సేవలందించడమే కాకుండా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేసేవిధంగా చేపడుతన్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కె.బ్రహ్మానందం, సహాయ మేనేజర్ పడకంటి వెంకటేశం, జూనియర్ ఆఫీసర్ శ్రావణి, క్యాషియర్ కమలేష్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు

పేదల వైద్య సేవలకు సహకారం

- ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, మే 11(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పేద ప్రజల వైద్యసేవలకు సహకారమందిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో ఇరవైమంది లబ్ధిదారులకు రూ.7లక్షల విలువచేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను, ఏడుగురికి రూ.9.90లక్షల విలువ చేసే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) పత్రాలను కార్పొరేటర్లతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామన్నారు. ప్రజలు అత్యవసర సందర్భాల్లో సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీతా, ప్రసన్నలక్ష్మీ, నాయకులు శైలేందర్, బెజ్జంకిరాజేష్, సతీష్, మేడిశెట్టి బాలాజీ, మనోహర్, రవీందర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



మాతృ దినోత్సవం

రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ ఆదివారం కార్ఖానాలోని వృద్ధాశ్రమంలో మాతృ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. వృద్ధులకు బ్రెడ్లు, పండ్లు, నిత్యావసర వస్తువులు అందచేసి, వారి ఆశీస్సులు అందుకున్నారు.

- (సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి)

ఘనంగా నరసింహస్వామి జయంతి వేడుకలు


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

రాంగోపాల్‌పేట్, మే 11 (ఆంధ్రజ్యోతి) : రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని సోమసుందరం వీధిలోని శ్రీదేవి పోచమ్మ దేవాలయంలో ఆదివారం నిర్వహించిన సహస్ర ఘటాభిషేకం సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బచ్చు శ్రీనివాస్, కోటగిరి రఘు, రాంచందర్, వెంకటేష్, శ్రీనివాసరావు శివనారాయణ గుప్తాలు ఆయనను శాలువాతో సత్కరించారు.

- నరసింహస్వామి జయంతి సందర్భంగా సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డు బాటా ప్రాంతంలోని నరసింహ స్వామి దేవాలయంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామివారికి హోమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, భక్తి గీతాలను ఆలపించారు.
- శ్రీలక్ష్మీనరసింహ స్వామి జయంతి వేడుకల్లో భాగంగా జీరా గార్డెన్ బస్తీలోని నరసింహ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అతెల్లి శ్రీనివాస్ గౌడ్

రెజిమెంటల్‌బజార్‌లో..

నరసింహ స్వామి జయంతి సందర్భంగా ఆర్పిరోడ్డులోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయంలో నిర్వహించిన హోమం, పూజల్లో స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొన్నారు.

- లక్ష్మీ నర్సింహస్వామి జయంతి సందర్భంగా బండిమెట్‌లో గల నర్సింహస్వామి ఆలయాన్ని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకొని పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్


ఫ్యాన్‌కు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బౌద్ధనగర్, మే 11(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్‌లకు బానిసై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సబితా తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌బాద్‌కు చెందిన బుక్య లింగన్న(26) నగరంలోని ఓ బ్యాంక్‌లో సేల్స్ సర్వీస్ ప్రొవైడర్‌గా ఉద్యోగం చేస్తూ భార్య పూజిత, బాబుతో కలిసి మేడిబావిలో నివాసముంటున్నాడు. భార్య గర్భవతి కావటంతో శుక్రవారం భార్య, బాబును ఊరుకు పంపించాడు. భర్త లింగన్నకు భార్య పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవటంతో భర్త స్నేహితుడైన బిక్షుకు ఫోన్ చేసి ఇంటికి వెళ్లి చూసి రమ్మంది. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన అతడు తలుపులు కొట్టినా లింగన్న తీయకపోవటంతో, పక్కన కిటికీలో నుంచి చూడగా లింగన్న చున్నీతో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతడు భార్య, బంధువులు, చిలకలగూడ పోలీసులకు సమాచారమందించాడు. లింగన్న మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు సోదరి నీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లింగన్న బెట్టింగ్‌లు ఆడుతుంటాడని పోలీసులు విచారణలో తేలింది. అప్పులు ఎక్కువ కావటంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన గుర్తు తెలియని వ్యక్తి

బోయినపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : కోటక్ మహీంద్ర బ్యాంక్ ఏటీఎంలో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించి విఫలమై వెళ్లిపోయిన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నతోకట్టలో చోటు చేసుకుంది. బోయినపల్లి డీఐ సర్దార్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం చిన్నతోకట్టలో గల హనుమాన్ దేవాలయం ముందు ఉన్న కోటక్ మహీంద్ర బ్యాంక్ ఏటీఎం సెంటర్‌కి రెండు రోజుల క్రితం ఓ గుర్తు తెలియని వ్యక్తి నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ఈ క్రమంలో ఏటీఎం సెంటర్‌లోకి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తి మిషన్‌పై స్ప్రేను చల్లాడు. ఆ తర్వాత అన్ని విధాల డబ్బుల కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. మరుసటి రోజు వచ్చిన హౌస్ కీపింగ్ సిబ్బంది ఏటీఎం సెంటర్‌లో వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉండటం గమనించి సెక్యూరిటీ ఫోర్స్ సూపర్‌వైజర్‌కు తెలియజేశారు. అక్కడకు చేరుకున్న సిబ్బంది విషయాన్ని గమనించి ఏటీఎం సెంటర్‌లో చోరీకి యత్నించినట్లు గుర్తించి బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న బోయినపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా చోరీకి యత్నించిన వ్యక్తిని సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా గుర్తించే పనిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి అదృశ్యం


గోల్కొండ ప్రసాద్

అడ్డగుట్ట, మే 11 (ఆంధ్రజ్యోతి) : పని కోసమని సికింద్రాబాద్‌కు వచ్చిన వరంగల్ వాసి అనుమానాస్పద స్థితిలో అదృశ్యమయ్యాడు. వరంగల్ కరీమాబాద్ కషీకుంట ప్రాంతానికి చెందిన గోల్కొండ ప్రసాద్(37) బతుకు దెరువు కోసం సికింద్రాబాద్‌కు చేరుకున్నాడు. నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులతో మాట్లాడి సికింద్రాబాద్‌లో ఓ హోటల్‌లో పనిచేస్తున్నానని సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు ప్రసాద్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉందని సికింద్రాబాద్‌లో ప్రసాద్ కోసం వాకబు చేస్తున్న అన్న, వదిన, తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్, గోపాలపురం పోలీస్‌స్టేషన్ ఇతర పోలీస్‌స్టేషన్లలో ప్రసాద్ మిస్సింగ్ కేసు నమోదు చేసి ఇతడి ఆచూకీ కోసం సికింద్రాబాద్‌లో తిరుగుతున్నారు. వ్యక్తి ఆచూకీ తెలిస్తే 9652497852, 9700121852 నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

దేశానికి సైనికులే శ్రీరామరక్ష


సీతారామాంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్న బీజేపీ డివిజన్ నాయకులు

బౌద్ధనగర్, మే 11(ఆంధ్రజ్యోతి): దేశానికి సైనికులే శ్రీరామరక్షని, సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులకు విజయం, మంచి ఆరోగ్యం ఇవ్వాలని కోరుతూ బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం అంబర్‌నగర్ సీతారామాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తు, నాగరాజు, కుమార్, ప్రమోద్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో..

త్రివిధ దళాలకు శక్తిని ఇవ్వాలని కోరుతూ తుకారాంగేట్‌లోని పహాడి హనుమాన్ ఆలయంలో బీజేపీ నాయకులు ఆదివారం పూజలు నిర్వహించారు. అడ్డగుట్ట డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో భారత మాత పేరుతో త్రివిధ దళాలకు శక్తి, మనోధైర్యం ఇవ్వాల్సిందిగా ఆంజనేయస్వామిని కోరారు. పూజా కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు హంసరాజు, వీరేశం, కళావతి, రాజారాం, శివలింగం, ఉదయ్ కుమార్, శేఖర్, శివాజీ, నరేందర్, ప్రసాద్, గంగారాం, చింటూ, మహేష్, శ్రీధర్ సమ్మయ్య, బాలు పాల్గొన్నారు.

రెజిమెంటల్‌బజార్..

ఇండియన్ ఆర్మీ తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆపరేషన్ సిందూర్‌లో పోరాడుతూ దేశానికి రక్షణగా ఉన్న భారత ఆర్మీ విజయం సాధించాలని డీడీ జీపీపీ ఫౌండర్ డాక్టర్ ప్రభు అన్నారు.

సికింద్రాబాద్‌లో ప్రపంచ శాంతి ప్రార్థన కేంద్రంలో భారత ఆర్మీ కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శాంతి ద్వారా ప్రజలకు మేలు కలుగుతుందని, యుద్ధం వల్ల అనేకమైన సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. సుప్రీంకోర్టు అడ్వకేట్ డాక్టర్ సాల్మన్ రాజ్ మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని ఏ దేశమైన సమర్థించకూడదని అది మానవ విలువలను నాశనం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీజీపీ బాబురావు, జీపీపీ ఉమెన్ ప్రెసిడెంట్ సునీత, న్యాయవాదులు పాల్గొన్నారు.


ఆవులను గోశాలకు తరలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ, జీహెచ్ఎంసీ సిబ్బంది

గోశాలకు పశువుల తరలింపు

బేగంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తర మండల ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆదివారం ప్రధాన రోడ్లలో ట్రాఫిక్‌కు అడ్డంగా వస్తున్న పశువులను తరలించే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహనదారుల నుంచి తరచూ వచ్చే ఫిర్యాదుల ఆధారంగా ఈ చర్య చేపట్టినట్లు ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు తెలిపారు. వీధుల్లో తిరుగుతున్న ఆవులు, ఎద్దులు, గేదెలు ట్రాఫిక్‌కు ఆటంకంగా మారి, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ, పాదచారుల్లో భయం కలిగించడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో రెండు వీధి ఆవులను రక్షించి కూకట్‌పల్లి వద్ద ఉన్న గోశాలకు తరలించామన్నారు.